క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బధిరుల సమస్యలు, సేవలపై అవగాహన కార్యక్రమం



మాట్లాడుతున్న అసోసియేషన్ జిల్లా సలహాదారు లక్ష్మి

మహారాణిపేట: బధిరులకు ఎదురయ్యే సమస్యలు, వారి అవసరాలు, వారికి అందాల్సిన వైద్య సేవలపై గురువారం రేసవానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఇంటర్నేషనల్ వీక్ ఆఫ్ డెఫ్ పీపుల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హారిక అధ్యక్షత వహించారు. 'చూపులతో మాట్లాడే వారి కోసం మనం వినిపించాలి'అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా సలహాదారు వి. లక్ష్మి ప్రత్యేక శిక్షణ అందించారు. ఎన్‌సీడీ మెడికల్ ఆఫీసర్లు, ఫిజియోథెరపిస్టులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జ్ఞానాపురంలో భారీ అన్నదానం



అన్నదానం చేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జ్ఞానాపురం న్యూ రైల్వే స్టేషన్ రహదారిలో ఆటో, ట్యాక్సీ స్టాండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మహా అన్నసమారాధన నిర్వహించారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు శ్రీధర్ హాజరై అన్న సమారాధనను ప్రారంభించారు. సుమారు 5 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వార్డులోని ఆటో డ్రైవర్లకు వైఎస్సార్‌సీపీ తరఫున అండగా ఉంటామని పూర్ణిమ, శ్రీధర్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

విశాఖ–లీగల్ : వినియోగదారుల హక్కుల చట్టం ప్రజలకు న్యాయం అందించడానికి ఒక బలమైన సాధనం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. గురువారం సిరిపురం వీఎంఆర్‌డీఏ మీటింగ్ హాలులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులందరికీ వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరమని, ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో ప్రజలు తమ హక్కులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల ఫోరం–2 జడ్జి వెంకటేశ్వరి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

- ఎన్నేళ్లయినా సమస్యల సుడిలోనే పాతనగరవాసులు
- చిన్నపాటి వర్షానికే ముంపునకు గురయ్యే లక్ష్మీనగర్, రామకృష్ణానగర్, చిలకపేట ప్రాంతాలు
- జలమయమయ్యే రహదారులు.. మురుగుతో నిండిపోయే కాలువలు
- వానొస్తే కూలుతున్న పురాతన కట్టడాలు



చిన్నపాటి వర్షానికే ఇళ్లలోకి నీరు చేరే రామకృష్ణానగర్

అవే వెతలు.. మారని బతుకులు

జగదాంబ: ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదముందని పాతనగర వాసులు భయందోళనలకు గురవుతున్నారు. చినుకు పడితే చిత్తడిగా మారే ప్రసాద్‌గార్డెన్స్, రామకృష్ణానగర్, లక్ష్మీనగర్, వెలంపేట, చిలకపేట, మాలాలీ పంజా, థామ్సన్ వీధి వర్షాలు పడినప్పుడు జలమయం అవుతుంటాయి. రహదారులు, ఇళ్లలోకి వర్షం నీరు ప్రవేశించి నిద్ర లేమి రాత్రులు గడపాల్సి వస్తుందని వాపోతున్నారు. దీంతో పాటు దుర్వాసన, అపారిశుధ్యం, మురుగు సమస్యతో నానా అగచాట్లు పడాలని స్థానికులు వాపోతున్నారు.

బాగుపడని డ్రైనేజీ వ్యవస్థ..

డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల పాతనగరంలోని చాలా ప్రాంతాల్లో వర్షం నీరు కాలువల్లో కంటే ఇళ్లు, రహదారుల పైనే ఎక్కువగా ప్రవహిస్తుంది. చిన్న వర్షం కురిసినా మోకాలి లోతు వరకు నీళ్లు నిలబడిపోతుంటాయి. స్థానికులు ఇబ్బంది పడుతూ అలాగే రాకపోకలు సాగిస్తుంటారు. వన్‌టౌన్‌లో అత్యంత మురికివాడలైన లక్ష్మీనగర్, ప్రసాద్‌గార్డెన్స్, రామకృష్ణానగర్, చిలకపేట, మాలాలీ పంజా ప్రాంతాల్లో ఈ దుస్థితి మరీ ఎక్కువగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు.



వర్షా కాలంలో ముంపునకు గురయ్యే లక్ష్మీనగర్

ఇబ్బందులకు గురి చేసే అపారిశుధ్యం..

వర్షాల నేపథ్యంలో వన్‌టౌన్‌లోని అనేక ప్రాంతాలు అపారిశుధ్యంతో కొట్టుమిట్టాడుతుంటాయి. పారిశుధ్య కార్మికులు ప్రధాన రహదారులను శుభ్రం చేస్తున్నారు కానీ చిన్నచిన్న వీధుల్లోని కాలువలను కనీసం పది రోజులకు ఒక్కసారైనా శుభ్రం చేయకపోవడంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులకు దారి తీస్తున్నాయి. గాజులవీధి, కల్లుపాకలు, కోటవీధి ప్రాంతాల్లో ఇళ్ల ముందే కాలువలు చెత్తా చెదారంతో నిండిపోయి ఉంటున్నాయి. స్థానికులు వాటి మధ్యే జీవిస్తున్నారు.



కెనాల్ కారణంగా ముంపునకు గురయ్యే చిలకపేట

వర్షాలకు కూలుతున్న కట్టడాలు..

వర్షాల కారణంగా పాతనగరంలోని పురాతన కట్టడాలు నేలకూలిపోతున్నాయి. గతంలో ఆర్ఆర్ఎం రోడ్డులో ఇళ్లు కూలిపోతే, ఇటీవల కల్లుపాకలు ప్రాంతంలోని ఓ ఇంటి శ్లాబ్ కూలిపోయింది. జీవీఎంసీ 39వ వార్డులో కూడా అనేక ఇళ్లు కాలం చెల్లిపోవడంతో వర్షాలకు కూలిపోతున్నాయి. అయినా జీవీఎంసీ వ్యాధులు, అపారిశుధ్యం, కూలిపోతున్న ఇళ్ల గురించి ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని పాతనగర వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌ను బలపరచాలి



జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడును మర్యాద పూర్వకంగా కలిసిన నాయకులు

దాబాగార్డెన్స్: పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ విశాఖ జిల్లా నూతన అధ్యక్షుడిగా సింహాచలం డిపో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.లక్ష్మణరావు (బీఎల్ రావు)ను అన్ని డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కార్యదర్శి కేవీ బాబు, జోనల్ అధ్యక్షుడు వి.రాధాకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేఎం నాయుడు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లక్ష్మణరావుతో పాటు మరో 20 మంది వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకున్నారు. వీరంతా గురువారం జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడును మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బీఎల్ రావు మాట్లాడుతూ ఉద్యోగులందరూ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌ను బలపరచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు, జోనల్ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ముగిసిన రచయిత్రుల జాతీయ సదస్సు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

కంచరపాలెం: సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో నిర్వహిస్తున్న రచయిత్రుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఏయూ హిందీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్. సత్యనారాయణ, రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు, లీడర్ దినపత్రిక ఎడిటర్ వి.వి. రమణమూర్తి, విశిష్ట అతిథి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ప్రొఫెసర్ డాక్టర్ టి. సత్యనారాయణ రచయిత్రుల కృషిని అభినందించారు. సదస్సు కన్వీనర్, కళాశాల కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.కె. జయలక్ష్మి నేతృత్వంలో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ద్వితీయ భాషా విభాగాధ్యక్షులు డాక్టర్ జె.నిర్మల, డాక్టర్ ఎస్.దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ నిర్ణయం విరమించుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం

దాబాగార్డెన్స్: పెదగంట్యాడలో అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు మళ్లీ పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తామన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కొత్తపల్లి లోకనాథం డిమాండ్ చేశారు. గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఈ నెల 8న పెదగంట్యాడలో నిర్వహించిన పబ్లిక్ హియరింగ్‌ను ప్రజలు స్వచ్ఛందంగా తిరస్కరించారన్నారు. ప్రజాభీష్టాన్ని గుర్తించి ప్రభుత్వం అదానీ సంస్థకు అనుమతులు రద్దు చేయాలని, దీనికి భిన్నంగా మరలా 15 రోజుల తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామని ప్రభుత్వం ప్రకటించడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. అదానీ గంగవరం పోర్టు కాలుష్యం వల్ల 10 లక్షల మంది ప్రజలు ఇప్పటికే అనేక వ్యాధులకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారని, ఇదే ప్రాంతంలో మరలా సిమెంట్ కంపెనీ ఏర్పడితే ప్రజలు నరకం చూడాల్సి వస్తుందన్నారు. ప్రజాగ్రహంతో పబ్లిక్ హియరింగ్ రద్దయిందని, ఇప్పటికైనా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అదానీ అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటుకు అనుమతులు రద్దు చేయాలని సీపీఎం డిమాండ్ చేస్తుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, వి.కృష్ణారావు పాల్గొన్నారు.

మందుల ధరలు తగ్గించి విక్రయించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జీఎస్‌టీ 2.0 ప్రకారం వైద్య ఆరోగ్యశాఖలో పలు మార్పులు సంభవించాయని, అందులో భాగంగా అనేక మందుల ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని, ఆ ధరలకే ఔషధాల విక్రయాలు జరగాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం చిత్రాలయ థియేటర్ దగ్గర జోన్–4 కార్యాలయ భవనం బిల్ జంక్షన్ సమావేశ మందిరంలో జీఎస్టీ 2.0 మీద ప్రైవేట్ ఆస్పత్రులు, ఇన్సూరెన్స్ యాజమాన్యంతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 5 శాతం అత్యవసర మందుల ధరలు తగ్గించారని అన్నారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రతి పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్స్ నిర్వాహకులు మారిన ధరల అమలుకు సహకరించాలన్నారు. ఈ సమావేశాం అనంతరం ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ బిల్ జంక్షన్ సమావేశ మందిరం నుంచి జగదాంబ కూడలి మీదుగా తిరిగి బిల్ జంక్షన్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఆర్.రమేష్, కమిషనర్ సీతాలక్ష్మి, జీఎస్టీకి చెందిన శ్రీనివాస్, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, నోడల్ అధికారులు ఐ.వి.దిలీప్, పి.వి.అభినవ్, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 27న కూచిపూడి కళావైభవం

సీతంపేట: డిసెంబర్ 27న హైదరాబాద్ వేదికగా కూచిపూడి కళావైభవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు భరత్ ఆర్ట్స్ ఫౌండర్ డైరెక్టర్ లలితారావు తెలిపారు. ద్వారకానగర్‌లోని బాబాపూ భవన్‌లో గురువారం కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భరత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 7,209 మంది కూచిపూడి కళాకారులతో కలిసి గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధుల సమక్షంలో ప్రపంచ రికార్డు సాధనకు పెద్ద ఎత్తున కళావైభవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమ అనంతరం గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు గిన్నిస్ బుక్‌లో వివరాలు నమోదు చేసి అధికారికంగా ప్రకటిస్తారన్నారు. కళావైభవంలో పాల్గొన దలచిన కూచిపూడి కళాకారులు 95151 12939 నంబర్‌లో సంప్రదించి తమపేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

మాజీ కార్పొరేటర్ కదిరి అప్పారావు మృతి



కదిరి అప్పారావు (ఫైల్)

దాబాగార్డెన్స్: మాజీ కార్పొరేటర్ కదిరి అప్పారావు అనారోగ్యంతో మృతి చెందారు. కోటవీధి, కదిరి దానప్పవీధి గ్రామ పెద్దగా, 14 గ్రామాలకు కుల పెద్దగా ఆయన వ్యవహరించారు. ఆయన మృతికి పలువురు నాయకులు సంతాపం వెలిబుచ్చారు. 1939 మార్చి 29న జన్మించారు. పాత కాలం నాయకులకు సుపరిచితుడు. కార్పొరేటర్‌గా పాతనగరం అభివృద్ధికి ఎంతో కృషి చేశారు.

మధ్యవర్తిత్వ శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ–లీగల్ : జిల్లాలో 40 గంటల మధ్యవర్తిత్వ శిక్షణ కోసం అర్హులైన సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు, సబ్జెక్టు నిపుణుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. అర్హులైన అభ్యర్థుల జిల్లాలో గల సంబంధిత న్యాయవాదులు సంఘం నుంచి జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

సంపత్ వినాయగర్ హుండీల ఆదాయం రూ.22.21 లక్షలు

మహారాణిపేట : ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ దేవాలయం హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 33 రోజులకు గాను రూ.22,21,967, వెండి 153 గ్రాములు లభించిందని ఈవో, సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ చోళన్ తెలిపారు. యుఎస్ఏ డాలర్లు 76, కెనడా డాలర్లు 10 వచ్చాయన్నారు. ఆదాయ లెక్కింపును శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవాలయం ఈవో కీర్తి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

సేవ్ గర్ల్ చైల్డ్‌పై వ్యాస రచన పోటీ

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో గురువారం సేవ్ గర్ల్ చైల్డ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం జయంతి రాధాకుమారి మాట్లాడుతూ సేవ్ గర్ల్ చైల్డ్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు ప్లకార్డులు తయారుచేసి ప్రదర్శించారు. సేవ్ గర్ల్ చైల్డ్ నినాదాలతో ప్రదర్శన కొనసాగింది. అనంతరం పాఠశాల స్థాయిలో సేవ్ గర్ల్ చైల్డ్ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎన్.గోమతి, కె.లక్ష్మీ శ్రీప్రియ, ఎన్.హర్షవర్ధన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరు శుక్రవారం జరగనున్న మండల స్థాయి వ్యాసరచన పోటీలో పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామల, గ్లోరీ, రత్నం, ఎం.ఎస్.వి.విశ్వనాథం పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో వైద్య ఖర్చుల్లో ఆదా



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: జీఎస్టీ 2.0 ప్రయోజనాలను ప్రజలకు వివరించేందుకు నరసింహనగర్ యూపీహెచ్‌సీ వైద్యుడు మనోజ్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. 43వ వార్డు దాడి రామ్మూర్తి కల్యాణ మండపం వద్ద ప్రారంభమైన ర్యాలీ శ్రీనివాసనగర్, నందగిరినగర్, జగన్నాథపురం ప్రాంతాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణ ఫలితంగా వైద్య సేవలు పేదలకు మరింత అందుబాటులోకి వచ్చాయన్నారు. జీవిత భీమా, ఆరోగ్య భీమాపై గతంలో ఉన్న 18 శాతం జీఎస్టీ ఇపుడు పూర్తిగా తొలగించారన్నారు. మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్, వివిధ రకాల మందులు, దృష్టి సరిచేసే కళ్లద్దాలపై గతంలో 12 శాతం జీఎస్టీ ఉండగా.. దానిని 5 శాతానికి తగ్గించారన్నారు. 36 రకాల ప్రాణ రక్షక, క్యాన్సర్ వంటి అరుదైన వ్యాధుల మందులపై గతంలో ఉన్న 12.5 శాతం జీఎస్టీ పూర్తిగా తొలగించారని తెలిపారు. వీటితో వైద్య ఖర్చుల్లో భారీ ఆదా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వెల్లువెత్తిన జనాభిమానం



కేజీహెచ్‌కు వచ్చిన జగనన్నను తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్న పోలీసులు, కేజీహెచ్ సిబ్బంది, నర్సులు

- మాజీ సీఎం జగన్‌ను చూసేందుకు పోలీసులు, వైద్య సిబ్బంది, జనం ఉత్సాహం



తమ సెల్‌ఫోన్లలో జగన్‌మోహన్‌రెడ్డిని బంధిస్తున్న అభిమానులు



సీఎస్ఆర్ బ్లాక్ నుంచి పిల్లల వార్డుకు చెట్లు, పుట్టలు దాటుకుంటూ వస్తున్న అభిమానులు, రోగుల సహాయకులు



రాజేంద్రప్రసాద్ వార్డు వద్ద మాజీ సీఎం జగన్‌ను చూసేందుకు బయటికి వచ్చిన రోగుల సహాయకులు

దాబాగార్డెన్స్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి గురువారం కేజీహెచ్‌ను సందర్శించారు. పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న గిరిజన బాలికలను ఆయన పరామర్శించారు. జగన్ రాక సందర్భంగా ఆయన్ని చూసేందుకు రోగులు, వారి సహాయకులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేసినా.. తగ్గేదే లేదంటూ ముందుకు సాగారు. జై జగన్ నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తించారు. భారీగా తరలివచ్చిన జనసందోహాన్ని నియంత్రించడానికి పోలీసులు ప్రయత్నించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది కూడా మాజీ సీఎం జగన్‌తో ఫొటోలు దిగేందుకు, వీడియోలు తీసేందుకు ఎంతో ఆసక్తి చూపారు. ఆయన పర్యటనతో కేజీహెచ్ ప్రాంగణం జనంతో కిక్కిరిసిపోయింది.

జగనన్న కోసం ఎందాకైనా..



35వ వార్డు నుంచి వాసుపల్లి ఆధ్వర్యంలో తరలి వెళ్తున్న పార్టీ శ్రేణులు, అభిమానులు

జగదాంబ: జననేత జగనన్న కొంకోట బహిరంగ సభ అనంతరం విశాఖపట్నం వస్తున్న నేపథ్యంలో జీవీఎంసీ 35వ వార్డు నుంచి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో భారీగా పార్టీ శ్రేణులు, అభిమానులు తరలి వెళ్లారు. ఇటీవల జాలరిపేటలో వేడినీళ్లు పడి 18 మంది గాయపడిన విషయం తెలిసిందే. వారిని జగనన్న పరామర్శించేందుకు కేజీహెచ్‌కు చేరుకోకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధినేత చెంతకు అంతా కలిసి..



41వ వార్డు కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్ నేతృత్వంలో తరలి వెళ్తున్న నాయకులు, అభిమానులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో గురువారం పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు. వార్డు నుంచి పార్టీ నాయకులు వందలాదిగా ఎయిర్‌పోర్టుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ వార్డు ప్రజలు స్వచ్ఛందంగా జగన్ పర్యటనకు తరలి రావడం అభినందనీయమన్నారు.

నిరాశ్రయ వసతి గృహాలకు అండగా నిలవాలి



ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవంలో పాల్గొన్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తదితరులు

అల్లిపురం: స్వచ్ఛంద సంస్థలు నిరాశ్రయ వసతి గృహాలకు, పోలీసు డిపార్టుమెంట్‌కు అండగా నిలవాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా కేఎస్ఆర్ బ్యాడ్మింటన్ అకాడమీ సభ్యులు, ఎంవీపీ సెక్టర్–6, హెల్త్ ఎరీనా ప్రతినిధులు గురువారం నిరాశ్రయులకు నిత్యావసర సరుకులు సీపీ చేతుల మీదుగా అందజేశారు. నిరాశ్రయులకు బాసటగా నిలుస్తున్న ఏయూటీడీ లాంటి సంస్థలకు, పోలీస్ డిపార్టమెంట్‌కు దాతలు అండగా నిలవాలని సీపీ కోరారు. నిరాశ్రయుల దినోత్సవం రోజున సహాయం అందించిన అకాడమీ సభ్యులు సుందర రామరాజు బృందాన్ని అభినందించారు. దాతలను సమీకరించిన 2 టౌన్ సీఐ ఎర్రంనాయుడు, సిబ్బందిని అభినందించారు. నిరాశ్రయులు, షెల్టర్ సిబ్బంది, దాతలకు ధన్యవాదాలు తెలిపారు. అకాడమీ సభ్యులు జి.ఎస్.ఎన్ రాజు (బీఎస్ఎన్ఎల్), సత్యనారాయణ, చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.